క్లుప్తంగా

పరామర్శ



ములుగు రూరల్: మండలంలోని మహ్మద్ గౌస్‌పల్లి బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పాలెపు శ్రీనివాస్ తండ్రి రాజమల్లయ్య శనివారం మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను ములుగు జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి పరామర్శించారు. శనివారం రాజమల్లయ్య పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఎంవీఐని కలిసిన ఎంపీటీసీ



ములుగు: స్థానిక ఎంవీఐ శ్రీనివాస్‌ను శనివారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు, పత్తిపల్లి ఎంపీటీసీ సభ్యుడు నూనావత్ మహేశ్‌నాయక్ తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఏజెన్సీ ప్రాంత వాసులకు డ్రైవింగ్ లైసెన్స్, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై విరివిగా అవగాహన కల్పించాలని కోరారు.

ఆరు గ్యారంటీలతో పేదలకు లబ్ధి

కన్నాయిగూడెం: పేదలకోసం పని చేసే పార్టీ కాంగ్రెస్ అని వైస్ ఎంపీపీ బొల్లె భాస్కర్ అన్నారు. పార్టీ చేపట్టిన గడపగడపకు కాంగ్రెస్ అనే కార్యక్రమాన్ని ఇన్‌చార్జ్‌లు భాస్కర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సునార్కని రాంబాబు, దబ్బగట్ల శ్రీనివాస్ ప్రారంభించారు. పార్టీ పేద ప్రజల కోసం నిరంతరం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో పాపరావు, చిన్న న్న,నాగేశ్వర్‌రావు, సమ్మయ్య, సిసింధర్, రాకేష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు

వినూత్న నిరసన



వెంకటాపురం(కె): అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ టీచర్స్, ఆయాలు చేస్తున్న సమ్మె శనివారం 20వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు పొర్లు దండాలు పెడుతూ వినూత్నంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కట్ల నర్సింహాచారి, అంగన్‌వాడీ నాయకులు రత్నకుమారి, భిక్షపతి, స్వరూప, బేబి, రమణ, సాంబలక్ష్మి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల మద్దతు

వాజేడు: మావోయిస్టులను ఎదుర్కొనేందుకు స్థానిక గిరిజనులు పోలీసులకు మద్దతు తెలిపినట్లు ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపారు. మండల పరిధిలోని పేరూరు పోలీస్‌స్టేషన్ సమీపంలో తెలంగాణా, చత్తీస్‌గఢ్ గుట్టల్లో 30 నుంచి 40 మంది మావోయిస్టులతో పోలీసులు జరిపిన ఎదురు కాల్పుల్లో స్థానిక గిరిజనులు, గ్రామస్తుల సహకారం ఉన్నట్లు తెలిపారు. రాష్ట్రంలో రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రాజకీయ నాయకులు, అధికారులు, పోలీసులతో పాటు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడాలనే ఉద్దేశ్యంతో మావోయిస్టులు కుట్ర పన్ని నట్లు తెలిపారు. స్థానిక గిరిజనుల సహకారంతో వారిని గ్రే హౌండ్స్ బలగాలు, ప్రత్యేక పోలీసులు బలగాలు, పోలీసులు చురుకుగా కదిలి తెలంగాణ రాష్ట్రంలోకి మావోయిస్టులను ప్రవేశించకుండా అడ్డుకోవడంతో పాటు ఎలాంటి నేరం జరుగ కుండా నిరోధించడం సాధ్యమైనట్లు తెలిపారు. ఈ ప్రాంతం ప్రశాంతంగా సురక్షితంగా ఉండాలంటే పోలీసులకు, ఆదివాసీలకు, గ్రామస్తులకు సంబంధాలు అభివృద్ధి చెందాలన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడమే లక్ష్యం



ములుగు రూరల్ : పొట్లాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న రవిచందర్

ములుగు రూరల్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బానోత్ రవిచందర్ అన్నారు. శనివారం మండలంలోని జీవింతరావుపల్లి, జగ్గన్నపేట , పత్తిపల్లి, పొట్లాపూర్ గ్రామాల్లో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన కాంగ్రెస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో ప్రజలు అవకాశం కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో అంకిరెడ్డి, శ్యామ్, కంబాల రవి, నాయకులు, కార్యకర్తలు , మహిళలు పాల్గొన్నారు.

మంగపేట: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమ అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని కాంగ్రెస్ అనుబంధ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య అన్నారు. కమలాపురం గ్రామకమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామంలో గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. సుమారు 100 మంది పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలిసి గ్రామంలో ప్రచార ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని మంగపేట, తిమ్మంపేట, కోమటిపల్లి, మల్లూరు, నర్సింహాసాగర్, రాజుపేట తదితర గ్రామాల్లో గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలతో కలిసి పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జైరాం రెడ్డి, జిల్లా నాయకులు యానయ్య, వెంకట్‌రెడ్డి, భగవాన్‌రెడ్డి, పల్లికొండ యాదగిరి, పెద్ది నర్సింహారావు, జగన్‌మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, నరేష్, నర్సింహారావు, వెంకన్న, సమ్మయ్య పాల్గొన్నారు.

వెంకటాపురం(ఎం): రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపెల్లి రాజేందర్ గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని లక్ష్మీదేవిపేటలో మండలాధ్యక్షుడు చెన్నోజు సూర్యనారాయణ ఆధ్వర్యంలో, మండల కేంద్రంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు చెన్నోజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మిల్కూరి అయిలయ్య, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు మామిడిశెట్టి కోటి, ఎంపీటీసీ జంగిలి శ్రీలత రవి, నాయకులు బొమ్మకంటి రమేష్, భూస సాంబయ్య, ఎస్‌కె.జాకీర్, కాంతాల రాజిరెడ్డి, రెడ్డి గణపతి, నల్లా కోటి సంపత్, పాల్గొన్నారు.

సోనియాగాంధీ రుణం తీర్చుకుందాం

ఎస్ఎస్‌తాడ్వాయి: సోనియాగాంధీ వల్లే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని ఆమె రుణం తీర్చుకునేందుకు వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని పార్టీ మండల ఇన్‌చార్జ్‌లు శ్యాం సుందర్‌రెడ్డి, ఎండీ ఆయూబ్‌ఖాన్‌లు కోరారు. శనివారం మండలంలోని మేడారంలో ఆరు గ్యారంటీ కార్డుల గడపగడప కార్యక్రమం సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి గ్యారంటీ కార్డులను ఆవిష్కరించారు. అనంతరం మేడారం , ఊరట్టం, కాల్వపల్లి, నార్లాపూర్, వెంగ్లాపూర్, కొత్తూరు, మండల కేంద్రంలోని తాడ్వాయి, నర్సింగాపూర్, ఇందిరానగర్, కామారం(పీటీ) గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఇంటింటికి గ్యారంటీ కార్డులను పంపిణీ చేసి పథకాలపై వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, గౌరవ అధ్యక్షుడు అనంతరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్, సర్పంచులు ఇర్ప సునీల్, రేగ కళ్యాణి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ పాక సాంబయ్య, మాజీ ఎంపీటీసీ భత్తిని రాజు , సీతక్క యువసేన జిల్లా అధ్యక్షుడు చర్పా రవీందర్ , ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న, జిల్లా నాయకులు అరెం లచ్చుపటేల్, వెంట్రాంరెడ్డి, అలకుంట రమేశ్ , ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు పూర్ణచందర్, గ్రామ కమిటీ అధ్యక్షులు పాక రాజేందర్ పాల్గొన్నారు.



కమలాపురంలో ప్రచార ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు



వెంకటాపురం(ఎం): మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేతలు



ఎస్ఎస్‌తాడ్వాయి : గ్యారంటీ కార్డులను పంపిణీ చేస్తున్న నాయకులు

రెండోసారి సమ్మెకు సిద్ధం



డీఎంహెచ్ఓకు నిరవధిక సమ్మె నోటీస్ అందచేస్తున్న రెండో ఏఎన్ఎంలు

ములుగు: తమ న్యాయపరమైన హక్కులను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 16 నుంచి సెప్టెంబర్ 3 వరకు నిరవధిక సమ్మె చేపట్టామని ఆ సమయంలో 17 రకాల డిమాండ్లను పరిష్కరిస్తామని త్రిసభ్య కమిటీని ప్రభుత్వం నియించిందన్నారు. కానీ ఇప్పటి వరకు కమిటీ సభ్యులు ఎలాంటి నిర్ణయం తీసుకోక పోవడం బాధాకరమని రెండో ఏఎన్ఎంలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా ఈనెల 05 నుంచి రెండోసారి నిరవధిక సమ్మె చేపట్టాలని నిరించుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు తహసీల్దార్‌లు, మెడికల్ ఆఫీసర్లు, డీఎంహెచ్ఓకు సమ్మె నోటీసులు అందచేశారు. రెండో ఏఎన్ఎంలకు మద్దతుగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి జంపాల రవీందర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో రెండో ఏఎన్ఎంలు సుజాత, సరోజన, సునిత, వజ్ర, వీరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మేడారంలో కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

ఎస్ఎస్‌తాడ్వాయి: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని మేడారంలో ఏర్పాటు చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ మైపతి అరుణ్ కుమార్, మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దనూక నర్సింగారావు, తుడుందెబ్బ జిల్లా నాయకుడు తాడ్వాయి సర్పంచ్ ఇర్ప సునీల్‌దొర, ఆదివాసీ విద్యార్థి ప్రధాన కార్యదర్శి కొర్నిబెల్లి గణేష్‌లు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని కొమురంభీం విగ్రహం వద్ద శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సెంట్రల్ యూనివర్సిటీ యాక్ట్ 57 ప్రకారం ములుగులో గట్టమ్మ దగ్గర 300 ఎకరాల్లో యూనివర్సిటీ ప్రతిపాదన సరైనది కాదన్నారు. విశాలమైన ప్రదేశంలో యునివర్సిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. మేడారంలో చింతకుంట చెరువు దగ్గర 600 ఎకరాల రెవెన్యూ భూమి ఉందన్నారు. వెనకబాటుకు గురైన మేడారంలో యూనివర్సిటీ నిర్మాణం చేస్తే ఆదివాసీ, దళిత, బహుజన, పేద వర్గాలకు విద్య అందే అవకాశం ఉందన్నారు. మేడారానికి రైలు మార్గం సౌకర్యం వస్తున్నందున యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే విద్యార్థులకు సైతం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కలెక్టర్ తక్షణమే స్పందించి మేడారంలోని ప్రభుత్వ భూమిని పరిశీలించాలని కోరారు. మేడారంలో అవకాశం లేని పక్షంలో ఏటూరు నాగారంలోని ఆకుల వారి గణపురంలోని గోదావరి నది ఒడ్డున 2వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని తెలిపారు. అక్కడ ఏర్పాటు చేసినా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రేగ కల్యాణి, ఇర్ప సారంగపాణి పోలెబోయిన రాకేష్, ఆదివాసీ నాయకుడు సోలం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పకడ్బందీగా విధులు నిర్వర్తించాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ రవీందర్

ఎస్ఎస్‌తాడ్వాయి: త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో విధులను పకడ్బందీగా నిర్వహించాలని డీఎస్పీ రవీందర్ సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని తాడ్వాయి పోలీస్ స్టేషన్‌ను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మేడారం జాతర సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు. మావోయిస్టులపై నిఘా పెట్టి వారి సమాచారం సేకరించాలన్నారు. ఎవరైనా అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే ప్రజలు వారి సమాచారం సేకరించి అందజేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్పీ గౌష్ ఆలం అదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పస్రా- తాడ్వాయి మధ్యలో రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు రేడియం స్టిక్కర్లను అటించామన్నారు. ఈ కార్యక్రమంలో పస్రా సీఐ శంకర్, తాడ్వాయి ఎస్సై ఓంకార్‌యాదవ్, సిబ్బంది ఉన్నారు.

బహిరంగ సభకు తరలిరావాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భిక్షపతి, గౌడ కులస్తులు

వెంకటాపురం(ఎం): వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఆదివారం జరిగే గౌడ గర్జన బహిరంగ సభకు గౌడ కులస్తులు తరలిరావాలని గౌడ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ముంజాల భిక్షపతి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని తాళ్లపాడులో గౌడ గర్జన వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గట్టు మహేష్, గుర్రం రజినికర్, చందర్, రాజ్ కుమార్, స్వప్న, రాధిక తదితరులు పాల్గొన్నారు.

‘ఆశా’ల సమ్మెకు కాంగ్రెస్ మద్దతు



వాజేడు: మానవహారం నిర్వహిస్తున్న కార్యకర్తలు

కన్నాయిగూడెం : మండలంలోని ఆశ కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మెకు మండలంలోని కాంగ్రెస్ పార్టీ మద్దతు ప్రకటించింది. సమ్మె చేస్తున్న శిబిరం వద్దకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండీ.అప్సర్ పాషా ఆధ్వర్యంలో కార్యకర్తలకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ చందు మాట్లాడుతూ వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో మండల యూత్ నాయకులు సునార్కని సురేందర్, దుర్గం ప్రభాకర్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించం

ఏటూరునాగారం: ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు సమ్మె విరమించేది లేదని, సమ్మెను మరింత ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావూద్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆశ కార్యకర్తలు 6వ రోజు సమ్మెలో భాగంగా మండల కేంద్రంలోని ఐటీడీఏ ఎదుట గల 163 వ జాతీయ రహదారిపై శనివారం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా దావూద్ మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశ కార్యకర్తలకు ఇస్తున్న పారితోషికాలను రద్దుచేసి కనీస వేతనం రూ.18 వేలు చెల్లించడంతో పాటు ప్రమాద బీమా సౌకర్యం రూ.5 లక్షల రూపాయలు ఇవ్వాలన్నారు. 2021 జులై నుంచి డిసెంబర్ వరకు ఆరు నెలల పెండింగ్ ఏరియర్స్ వెంటనే చెల్లించాలన్నారు. కేంద్రం చెల్లించిన కరోనా రిస్క్ అలవెన్స్ నెలకు రూ.వెయ్యి చొప్పున 16 నెలల బకాయి డబ్బులు వెంటనే అందజేయాలన్నారు. ఆశ కార్యకర్తలకు ప్రసూతి సెలవుల సర్క్యులర్ వెంటనే విడుదల చేయాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని దావూద్ డిమాండ్ చేశారు. సమ్మెకు బీఎస్పీ జిల్లా కమిటీ నాయకులు పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాజు, హరికృష్ణ, ఎంపెల్లి వీరస్వామి, గడ్డం బిక్షపతి, చిర్రరాజు, కిశోర్, ఆశ వర్కర్లు సరిత, మాధవి, సునీత, వనజ, భవాని, కౌశిక, శారద తదితరులు పాల్గొన్నారు.

పారితోషికాల విధానం రద్దు చేయాలి

పారితోషికాల విధానం రద్దు చేయాల్టి ఆఇఖఔఉిశాములుగు రూరల్: ఆశ కార్యకర్తలకు పారితోషికాల విధానం రద్దు చేసి కనీస వేతనాలు అమలు చేయాలని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రత్నం నీలాదేవి అన్నారు. జిల్లాకేంద్రంలోని జాతీయ రహదారిపై శనివారం మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశ కార్యకర్తలకు కనీసవేతనం రూ.18వేలు చెల్లించడంతో పాటు పీఆర్‌సీ అందించాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో కేంద్రం ప్రభుత్వం ఇచ్చిన రూ.16 వేలను రాష్ట్ర ప్రభుత్వం వాడుకుందన్నారు. వెంటనే ఆశ కార్యకర్తల ఖాతాలలో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఆశ కార్యకర్తలకు హెల్త్‌కార్డు, ప్రమాద బీమా, ఏఎన్ఎం పోస్టుల్లో 30 శాతం వేయిటేజ్ కల్పించాలన్నారు. ఆశ కార్యకర్తల సమ్మెకు సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో గుండబోయిన రవిగౌడ్, మంజుల, రజిత, ధనలక్ష్మీ, సరిత, ఈశ్వరి, సుజాత, శిరీష, యశోద, రమా, మమత, స్వప్న, ఆదిలక్ష్మీ, సారలక్ష్మీ, పద్మ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావాలని పూజలు



సమ్మక్క గద్దె వద్ద పూజలు చేస్తున్న నాయకులు

ఎస్ఎస్‌తాడ్వాయి: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కేంద్రం, రాష్ట్రంలో అధికారంలోకి రావాలని మేడారం సమ్మక్క-సారలమ్మలను పార్టీ జిల్లా కార్యదర్శి గణపాక సుధాకర్ శనివారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మళ్లీ సీతక్క ఎమ్మెల్యే అయ్యేలా దీవించాలని, మంచి ఉన్నత స్థాయికి ఎదగాలని అమ్మవార్లకు పూజలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ అత్యున్నత స్థాయికి ఎదగాలని వనదేతలను వేడుకున్నట్లు తెలిపారు. మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రసపుత్ సీతారాంనాయక్, జిల్లా కార్య నిర్వహణ కార్యదర్శి జంపాల చంద్రశేఖర్, ఎంపీటీసీ గుండెబోయిన నాగలక్ష్మి అనిల్ యాదవ్, చల్వాయి గ్రామ అధ్యక్షుడు పూర్ణ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం



కళాశాలలో శ్రమదానం చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



మంగపేట: దోమెడలో ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న వైద్యాధికారి, ఏఎన్ఎం

మంగపేట : ప్రజలు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభతను పాటిస్తే సీజనల్ వ్యాధులు దరిచేరవని బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కారం నిఖిల్‌కుమార్ అన్నారు. మండలంలోని దోమెడలో ఆయన వైద్య సిబ్బందితో కలిసి గ్రామంలో శనివారం ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించి ఇంటింటికి వెళ్లి వ్యాధులతో ఇబ్బంది పడుతున్న బాధితుల వివరాలు సేకరించి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. జ్వరాల బారిన పడకుండా కాచి వడపోసిన నీటిని తాగాలని, కలుషిత ఆహారం, నిల్వ ఉన్న ఆహారాన్ని భుజించవద్దన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ జయశ్రీ, ఏఎన్ఎం శ్రీలత పాల్గొన్నారు.

ఎస్ఎస్‌తాడ్వాయి : పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యానికి మేలు అని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాంపాక అవిలయ్య అన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో స్వచ్ఛత క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణలో ఉన్న పిచ్చిమొక్కలు చెత్తాచెదారం తొలగించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కొమ్మాల సంధ్య, అధ్యాపకులు కిషన్ శ్వేతా, రాజ్ కుమార్, రాజు అశోక్, శ్రీలత, నాగరాజు, హరికృష్ణ, దివ్య, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ‘గృహలక్ష్మి’ వర్తింపజేయాలి

కన్నాయిగూడెం: మండలంలోని వర్కింగ్ జర్నలిస్టులు జిల్లా కలెక్టర్‌కు జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించి, సంక్షేమ పథకాల్లో అవకాశం కల్పించాలని వినతిపత్రం అందించారు. మండలానికి వచ్చిన కలెక్టర్‌కు ఎంపీడీఓ కార్యాలయ వద్ద వర్కింగ్ జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ,డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని కోరుతూ వినతిపత్రాన్ని జర్నలిస్టులు వినతి పత్రం అందించారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే అమలు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ జర్నలిస్టులు దుర్గం రాజు, పూజారి సుధాకర్, మల్లేష్, శ్యామ్, ఎండీ. షయక్, కొయ్యల మహేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సమూల మార్పులు తీసుకురావాలి



మాట్లాడుతున్న గెజిటెడ్ హెచ్ఎం భాస్కర్‌రావు

మంగపేట : మండలంలోని రాజుపేట స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని అన్ని పాఠశాల్లో సమూల మార్పులు తీసుకురావాలని రాజుపేట జెడ్పీహెచ్ఎస్ కాంప్లెక్స్ గెజిటెడ్ హెచ్ఎం రావుల భాస్కర్‌రావు అన్నారు. పాఠశాలకు గెజిటెడ్ హెచ్ఎంగా పదోన్నతిపై వచ్చిన ఆయన స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో మొదటి సమావేశం గడ్డం శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులను పరిచయం చేసుకుని పాఠశాలల్లో అనేకమైన మార్పులు తీసుకువచ్చేందుకు కృషి చేయాలని, విద్యారంగంలో విద్యార్థులను ముందంజలో ఉంచాలని ఆయన ఆకాంక్షించారు. మండంలో రాజుపేట కాంప్లెక్స్‌లో రైటింగ్, స్కిల్స్, రీడింగ్ స్కిల్స్, కంపొంటెన్సీ స్కిల్స్‌లో ప్రథమ స్థానంలో ఉంచాలన్నారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్ఎంలు, పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యం



పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న నాగజ్యోతి

ములుగు రూరల్: సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ములుగు జెడ్పీ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. శనివారం మండలంలోని రాంచంద్రాపూర్‌లో సర్పంచ్ హట్కర్ కల్పన రూప్‌సింగ్ ఆధ్వర్యంలో పార్టీలో మహిళలు, యువత చేరగా వారిని పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పని చేయాలని అన్నారు. కార్యక్రమంలో రెడ్కో చైర్మన్ సతీష్‌రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్, రాజేందర్, మోతీలాల్, రవి, అజయ్, రాజు, సునీత, రాధమ్మ, వినోద పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్ కోసం సంఘటితం కావాలి

- ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బరాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్



సమావేశంలో మాట్లాడుతున్న ఉపేందర్

ఏటూరునాగారం: రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం సంఘటితం కావాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ అన్నారు. శనివారం స్థానిక బీఆర్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏటూరునాగారం కేంద్రంగా తాడ్వాయి, కన్నాయిగూడెం, ఏటూరునాగారం, మంగపేట, వాజేడు, వెంకటాపురం మండలాలతో కలిపి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలన్నారు. కొమురం భీం వర్ధంతిని పురస్కరించుకొని అక్టోబర్ 28 నుంచి నవంబర్ 6 వరకు గూడేల్లో వర్ధంతులు ఘనంగా నిర్వహించాలని కోరారు. ఆదివాసీ చట్టాలను రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదని, వివిధ వంకలు పెడుతూ చట్టాలకు తూట్లు పొడుస్తున్నారన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసులకు వందశాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాతీయ కన్వీనర్ రమనాల లక్ష్మయ్య, కో కన్వీనర్ పొడెం రత్నం, యాసం రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కబ్బాక శ్రావణ్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి వట్టం కన్నయ్య, రామినేని సురేందర్, సీనియర్ నాయకుడు బచల ఎర్రయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి చందా మహేష్, ములుగు, వరంగల్ జిల్లాల అధ్యక్షులు చింత కృష్ణ, గొంది నాగేష్, ఉపాధ్యక్షులు వట్టం జనార్ధన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎట్టి రాజబాబు, జిల్లా కార్యదర్శి కావుల సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఈ రోడ్డుపై ప్రయాణం నరకమే



వెంకటాపురం(కె): మండల పరిధిలోని ఎదిర పంచాయతీ నుంచి వెంకటాపురం గ్రామపంచాయతీ వరకు సుమారు 30 కిలోమీటర్ల దూరం వరకు ఆర్‌అండ్‌బీ రహదారి గుంతలమయంగా ఉండటంతో రహదారిపై ప్రయాణించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని బోదాపురం సమీపంలో ఆర్‌అండ్‌బీ రహదారిపై గుంతలు ఎక్కువగా ఉండటంతో ఈ రహదారిపై ద్విచక్రవాహనదారులు, ఆటోలు, కార్లు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారులు మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.